క్లుప్తంగా

మావుళ్లమ్మకు బంగారం సమర్పణ


మావుళ్లమ్మకు బంగారం సమర్పిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణ ఇలవేల్పు శ్రీమావుళ్లమ్మకు ఆత్రేయపురానికి చెందిన హర్షవర్మ నాగసాయి దంపతులు 8 గ్రాముల బంగారం సమర్పించారు. వారికి ఆలయ సిబ్బంది ప్రసాదం, రసీదును అందజేశారు. ముందుగా వారు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రఘురామ చర్యలు సిగ్గుచేటు


సుందర్‌కుమార్

ఉండి: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఫ్లెక్సీని స్వయంగా స్థానిక ఎమ్మెల్యే రఘురామ కృష్ణరాజు తొలగించడం సిగ్గు చేటని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ లీగల్‌సెల్ అధ్యక్షుడు, న్యాయవాది గొర్రుముచ్చు సుందర్‌కుమార్ మండిపడ్డారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఏలూరుపాడులో ఎమ్మెల్యే రఘురామకృష్ణ రాజు బాధ్యతాయుతమైన స్థానంలో ఉండి కూడా అంబేద్కర్ ఫ్లెక్సీ తొలగించడం ఏంటి? అని మండిపడ్డారు. ఫ్లెక్సీ విషయంలో ఫిర్యాదులు ఏమైనా ఉంటే అధికారులు తొలగించాలని, కానీ నేరుగా ఎమ్మెల్యే ఓ వర్గానికి కొమ్ముకాస్తూ ఫ్లెక్సీ తొలగించడం దారుణమని మండిపడ్డారు. ఇరుపక్షాలను కూర్చోబెట్టి సమస్య పరిష్కరించాల్సిన ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు రెచ్చగొట్టే చర్యలకు దిగడం దారుణమని పేర్కొన్నారు.

ముత్యాలమ్మ ఆలయంలో భక్తుల రద్దీ


ముత్యాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

మొగల్తూరు : మండలంలో ప్రసిద్ధి చెందిన ముత్యాలపల్లి బండి ముత్యాలమ్మ వారిని దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు భారీగా తరలి వచ్చారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకటలాడింది. భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగుకుండా ఆలయ చైర్మన్ కడలి మాణిక్యాలరావు, ఈఓ డి.రామకృష్ణంరాజు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి

నరసాపురం: పట్టణంలో ప్రధాన డ్రెయినేజీలను శుభ్రం చేసి పారిశుద్ధ్య ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య అధికారులను ఆదేశించారు. ఆదివారం ఆయన పట్టణంలోని పలు వార్డుల్లో డ్రెయినేజీలను పరిశీలించారు. ప్రతిరోజూ డ్రెయినేజీలను శుభ్రం చేయడం ద్వారా దోమల సమస్యలుండవని చెప్పారు. ఇటీవల వర్షాల వల్ల ముంపునకు గురైన ప్రాంతాల్లో పారిశుద్ధ్య పరిస్థితులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

ఉత్సాహంగా గుర్రం జాషువా పద్యపఠన పోటీలు

నరసాపురం రూరల్: నవయుగ కవితా చక్రవర్తి గుర్రం జాషువా జయంతి సందర్భంగా అంబేద్కర్ ఆలోచనల వేదిక సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక సన్‌షైన్ స్కూల్ ఆడిటోరియంలో విద్యార్థులకు పద్య పఠన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా విశ్రాంత ఉపాధ్యాయురాలు తాడిమేటి కృష్ణవేణి, రవుతుల రామ్మోహన్, తెలుగు ఉపాధ్యాయుడు నాగభూషణం లు వ్యవహరించారు. ఈ పోటీల్లో 20 పాఠశాలలకు చెందిన 60 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పోటీల్లో గెలుపొందిన వారికి ఈ నెల 28న ఉదయం 10 గంటలకు స్థానిక సన్‌షైన్ స్కూల్ ఆడిటోరియంలో జరిగే గుర్రం జాషువా జయంతి సభలో బహుమతులను అందిస్తామని నిర్వాహకుడు, అంబేద్కర్ ఆలోచనల వేదిక సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సు . దీర్‌మోహన్ తెలిపారు.

వైభవంగా గరికపూజ

పాలకొల్లు అర్బన్: మండలంలోని వాయు త్రిలింగ క్షేత్రంగా ప్రసిద్ధి చెందిన శ్రీ పార్వతీ సమేత శ్రీ శివదేవస్వామి ఆలయంలో సంకటహర చతుర్థి పురస్కరించుకుని విఘ్నేశ్వరునికి ప్రత్యేక అభిషేకాలు, గరికతో పూజ నిర్వహించారు. సంకటహర చతుర్థి రోజున విఘ్నేశ్వరినికి పూజలు చేస్తే విద్య, ఉద్యోగం, వ్యాపారాలు వృద్ధి చెందుతాయని అర్చక స్వామి ర్యాలి శివాజీ భక్తులకు ఉపదేశం ఇచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

యథేచ్ఛగా నీటి దోపిడీ


ఓ అపార్ట్‌మెంట్ వద్ద మోటార్లకు అమర్చిన మున్సిపల్ పైపు


ట్యాంకర్ ద్వారా సరఫరా చేసే నీటి కోసం ఏర్పాటు చేసిన టిన్నులు

- మున్సిపల్ నీరు అపార్ట్‌మెంట్లకు
- నిబంధనలు గాలికి
- పట్టించుకోని వాటర్ సరఫరా విభాగం అధికారులు

భీమవరం(ప్రకాశం చౌక్): పట్టణంలో మున్సిపల్ నీళ్లను అపార్ట్‌మెంట్‌ల వారు నిబంధనలు అతిక్రమించి పెద్ద సైజు పైపులు ఏర్పాటు చేసుకొని మోటార్ల సాయంతో నీటి దోపిడీ చేస్తున్నారు. అయినా సంబంధిత వాటర్ సప్లై అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పైపులైన్ల ద్వారా చివరి ప్రాంతాలకు మంచినీళ్లు చేరడం లేదు. చివరి ప్రాంతాలైన బీసీ కాలనీ, ప్రకాష్ నగర్, మల్లెతోట, 6వ వార్డు, తదితర ప్రాంతాల పేద, మధ్య తరగతి ప్రజలు మంచినీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. అపార్ట్‌మెంట్‌ల్లోని ధనికులకు మాత్రం పుష్కలంగా మున్సిపల్ నీళ్లు అందుతున్నాయి. మంచినీరు సక్రమంగా చేరని ఆయా ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీళ్లు సరఫరా చేస్తున్నారు. మంచినీటి ట్యాంకర్ వారం రోజులకోసారి లేదా పది రోజుకోసారి వెళ్లడంతో ఆయా ప్రాంతాల ప్రజలు మంచినీటి కోసం ఆలమటిస్తున్నారు. పైపులైన్లు ఉండి కూడా కొన్ని ప్రాంతాలకు చుక్క నీరు చేరడం లేదు. దీంతో ట్యాంకర్ కోసం ఎదురు చూడడం, ట్యాంకర్ వచ్చినప్పడు పట్టుకొని దాచుకోవడం, నీరు సరిపోకపోతే బయట మార్కెట్‌లో టిన్నులతో కొనుగోలు చేసుకుంటున్నారు.

నీటి దోపిడీని పట్టించుకోని అధికారులు

నిబంధనల మేరకు మున్సిపల్ పైపులైన్ నుంచి అర అంగుళం లేదా అంగుళం పైపు మాత్రమే ఏర్పాటు చేసుకోవాలి. కాని అపార్ట్‌మెంట్‌ల వారు రెండు అంగుళాలున్న పైపులు ఏర్పాటు చేసి, మోటార్ల సాయంతో మున్సిపల్ నీటిని పరిమితి దాటి దోపిడీ చేస్తున్నారు. పట్టించుకోవలసిన మున్సిపల్ వాటర్ సరఫరా విభాగం అధికారులు మాత్రం అపార్ట్‌మెంట్ల వారి నుంచి ముడుపులు తీసుకొని నీటి దోపిడీని అరికట్టడం లేదు. దీంతో చివరి ప్రాంతాల ప్రజలకు నీళ్లు చేరక గొంతు ఎండుతుంది.

పైపుల లీకేజీల మరమ్మతులూ పట్టించుకోరు

ఒక పక్క అపార్ట్‌మెంట్ల వారు నిబంధనలు అతిక్రమించి, నీటిని తోడేస్తున్నారు. మరో పక్క పైపు లీకేజీల ద్వారా మంచినీరు వృథాగా పోతుంది. అయినా అధికారులు పట్టించుకోరు. పైపుల లీకేజీలకు పటిష్టంగా మరమ్మతులు చేయడం లేదు. మరమ్మతులు చేయకుండానే బిల్లులు పెట్టి, ప్రజల సొమ్మును కాజేస్తున్నారనే ఆరోపణలు కూడా మున్సిపల్ వాటర్ విభాగం అధికారులపై ఉన్నాయి. ఇప్పటికై నా సంబంధిత అధికారులు స్పందించి, పట్టణ శివారు ప్రాంతాలకు తాగునీటిని అందించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే అపార్ట్‌మెంట్ల నీటి దోపిడీని అరికట్టాలని పలువురు కోరుతున్నారు.

కుళాయి ఉన్నా ఇబ్బంది పడుతున్నాం



మాకు మున్సిపల్ నీటి కుళాయి ఉంది. కాని పైపు లైన్ ద్వారా మంచినీరు రాదు. దీంతో ట్యాంకర్ల ద్వారా వారానికోసారి నీటి సరఫరా చేస్తున్నారు. సరిపోక మంచినీటి కోసం అనేక ఇబ్బందులు పడుతున్నాం. మంచినీటి ట్యాంకర్ కోసం ఎదురు చూడవలసిన పరిస్థితి ఉంది. పైపులైన్ ఉండి కూడా మాకు నీరందకపోవడం దారుణం. పైపులైన్ ద్వారా నీటి సరఫరా చేయాలి.

– ఎస్.లావణ్య, పైపుల చెరువు రోడ్డు

కిలోమీటరు నుంచి తెచ్చుకుంటున్నాం



మున్సిపల్ ట్యాంకర్ల ద్వారా మంచినీరు సరఫరా చేస్తున్నారు. నీరు సరిపోక మంచినీటి కోసం అనేక ఇబ్బందులు పడుతున్నాం. దీంతో కిలోమీటరు దూరంలో ఉన్న హెడ్ వాటర్ వర్క్స్ వద్ద నుంచి మంచినీరు తెచ్చుకుంటున్నాం. కనీసం రెండు రోజులకోసారి మంచినీటి ట్యాంకర్ వచ్చేలా చూడాలి.

– బి.నారాయణమ్మ, 6వ వార్డు, భీమవరం

వృద్ధులకు దుస్తుల పంపిణీ


దుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం

పాలకోడేరు: సమసమాజం కోసం కాంక్షించిన మానవతావాది పిన్నమనేని ప్రతాప్ రాజు అని ఏబీఎస్‌వీకే ట్రస్టు చైర్మన్ బి.బలరాం అన్నారు. అల్లూరి సీతారామ రాజు, భగత్ సింగ్ సేవా విజ్ఞాన కేంద్రం ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం విస్సాకోడేరు రావిచెట్టు వద్ద పిన్నమనేని ప్రతాప్‌రాజు వర్ధంతిని నిర్వహించారు. విస్సాకోడేరులో, మోగల్లు గుత్తులవారి పాలెంలో వృద్ధులకు, నిరుపేదలకు దుస్తులు పంపిణీ చేశారు. సీపీఎం మండల కార్యదర్శి శేషపు ఆశ్రీయ్య, నాయకులు దున్నా మరియమ్మ, గోపాలరాజు, ఖండవల్లి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాజీ చైర్మన్ వెంకట్రామయ్య జయంతి


నాచు వెంకట్రామయ్య విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): మున్సిపల్ కార్యాలయంలో మాజీ చైర్మన్ నాచు వెంకట్రామయ్య విగ్రహం వద్ద సుందరీ వనం నిర్మాణానికి నిధులు ఇవ్వడానికి వారి కుటుంబ ముందుకు వచ్చారు. నాచు వెంకట్రామయ్య 110వ జయంతిని కుటుంబ సభ్యులు, అభిమానుల ఆధ్వర్యంలో వెంకట్రామయ్య విగ్రహం వద్ద నిర్వహించారు. రాష్ట్ర మున్సిపల్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్.కృష్ణమోహన్, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా అన్నసమారాధన


అన్నసమారాధన నిర్వహిస్తున్న దృశ్యం


శాంతినగర్‌లో నిర్వహిస్తున్న అన్నసమారాధన

భీమవరం (ప్రకాశంచౌక్): స్థానిక 14వ వార్డులోని ముత్యవారి తోటలో మావుళ్లమ్మ శ్రీరామబాల భక్త శ్రీమణికంఠ యువజన సంఘం ఆధ్వర్యంలో శ్రీగణపతి స్వామి వారి 14వ వార్షిక మహోత్సవం సందర్భంగా మద్దుల రాము కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా మహా నివేదన పూజా కార్యక్రమాలు చేశారు. అనంతరం సుమారు 2000 మంది భక్తులు స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మెంటే పార్థసారథి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ మెరగాని నారాయణమ్మ, కటికి పల్లవరావు, పడమటి నరసింహమూర్తి, కమిటీ సభ్యులు శ్రీధర్ వెంకన్న, గనిరెడ్డి సూరి, నక్కా గోవింద్, విరోతి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అఖండ అన్నసమారాధన

ఆకివీడు: వినాయక చవితి ఉత్సవాలు ముగింపు సందర్భంగా స్థానిక వరసిద్ధి వినాయక స్వామి ఆలయం వద్ద ఆదివారం అఖండ అన్న సమారాధన నిర్వహించారు. అన్నసమారాధనకు అత్యధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామి వారి ప్రసాదం స్వీకరించారు. ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ సప్పా మణికంఠ, కార్యదర్శి రాజు, ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు గంధం ఉమ, ఎలీషా, సాంబశివరావు, మాకా చిన్నా తదితరులు సేవలను అందించారు.

ఉపాధ్యాయులకు చెస్ పోటీలు


చెస్ పోటీల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు

భీమవరం: యూటీఎఫ్ స్వర్ణోత్సవం సందర్భంగా ఆదివారం భీమవరంలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ఉపాధ్యాయుల జిల్లా స్థాయి చెస్, కేరమ్స్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా గోపీమూర్తి మాట్లాడుతూ యూటీఎఫ్ ఏర్పడి 50 ఏళ్లు అయిన సందర్భంగా ఉపాధ్యాయులకు వివిధ రకాల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీఎస్ విజయరామరాజు, సీహెచ్ పట్టాభి రామయ్య, టీజే జయకుమార్, పి.క్రాంతి కుమార్, కె.శ్రీరామకృష్ణ ప్రసాద్, డి.ఏసుబాబు, జి.రామకృష్ణ రాజు, ఎం.శ్రీనిబాబు, తదితరులు పాల్గొన్నారు.

బెంబేలెత్తిస్తున్న గ్రామ సింహాలు


స్థానికంగా బెంబేలెత్తిస్తున్న గ్రామ సింహాలు.

ఆకివీడు: ఇటీవల కాలంలో గ్రామ సింహాల హోడా విడి పెరిగిపోతుంది. వరదలు, భారీ వర్షాలతో కొల్లేరు తీర గ్రామాల్లోని కుక్కలు సమీప గ్రామాల్లోకి వస్తున్నాయి. కొన్నింటిని ఆయా గ్రామాలకు చెందిన వారు తీసుకువచ్చి గ్రామ సరిహద్దుల్లో వదిలివేస్తున్నారు. దీంతో గ్రామంలోకి చొరబడి స్థానికంగా ఉన్న కుక్కలతో యుద్ధానికి సై అంటూ కలిబడుతున్నాయి. ప్రజలపై కూడా విరుచుకుపడే ప్రయత్నాలు చేస్తున్నాయి. కుక్కల బెడదతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. కొత్త కుక్కలు ప్రవేశించడంతో మరింత ఆందోళనకు గురవుతున్నారు. కుక్కల బెడదను తొలగించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతన్నారు.

కనకదుర్గమ్మకు మంగళ సూత్రాల సమర్పణ

యలమంచిలి: మండలంలోని అడవిపాలెం గ్రామ దేవత శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారికి తూర్పుగోదావరి జిల్లా గూడపల్లి గ్రామానికి చెందిన పిల్లి నరేంద్ర, దుర్గా హనుమ కుమారి దంపతులు ఆదివారం నాలుగు గ్రాముల బంగారు మంగళ సూత్రాలను సమర్పించారు. అర్చకులు ఆగమప్రవర సుదర్శనం శ్రీనివాసాచార్యులు అమ్మవారికి మెడలో నూతన మంగళ సూత్రాలు అలంకరించారు. దాతలు అమ్మవారికి మంగళ సూత్రాలతో పాటు చలివిడి పానకాలు, పసుపు, కుంకుమ, గాజులు, చీర సమర్పించారు. బంగారు సూత్రాలు సమర్పించిన దంపతులకు అమ్మవారి చిత్రపటాన్ని ఆలయ ధర్మకర్తలు బొలిశెట్టి రావులియ్య, పితాని శ్రీనివాసరావు అందజేశారు. దాత కుటుంబ సభ్యులకు ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

రోటరీ క్లబ్ సేవలు అభినందనీయం


రోటరీ క్లబ్ సభ్యులను అభినందిస్తున్న దృశ్యం

భీమవరం: స్థానిక రోటరీ క్లబ్ కృషి అభినందనీయమని భీమవరం ఆల్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు అన్నారు. ఆదివారం ఉదయం భీమవరం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సుందరీకరింపబడుతున్న రోటరీ క్లబ్ సూర్య కృష్ణ పార్క్ ఎడ్వర్డ్ ట్యాంక్ పనులను పరిశీలించి వివిధ సూచనలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూపూడి సంజయ్ రూ.55 లక్షల భారీ విరాళంతో 80 శాతం పనులు పూర్తయ్యాయన్నారు. కార్యక్రమంలో బొండా వెంకట సుబ్బారావు, బొండా రాంబాబు, ఒడుపు గోపి, బొండా శ్రీరాం, నడింపల్లి మహేష్ కుమార్, వబిలిశెట్టి వెంకటేశ్వర్లు, వబిలిశెట్టి రామకృష్ణ, కారుమూరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నాణేలు, స్టాంపుల ప్రదర్శన


వివరాలు తెలుసుకుంటున్న డాక్టర్ బాబ్జి

పాలకొల్లు సెంట్రల్: సమాజంలో నేటి యువతరానికి పురాతనమైన వస్తులపై అంతగా అవగాహన లేదని ఇటువంటి ప్రదర్శనల ద్వారా విద్యార్థులు పురాతన వస్తువులు వాటి వినియోగంపై అవగాహన చేసుకోవాల్సిన అవసరం ఎంతైన ఉందని మాజీ శాసనసభ్యుడు డాక్టర్ సీహెచ్ సత్యనారాయణమూర్తి (బాబ్జి) అన్నారు. ఆదివారం స్థానిక లయన్స్ కమ్యూనిటీ హాలులో యూత్ హాస్టల్స్ పాలకొల్లు శాఖ 32వ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన నాణేలు, స్టాంపుల ప్రదర్శన స్టాల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ రెండు రోజుల పాటు జరగనున్న ఈ ప్రదర్శనను ప్రతి పాఠశాల నుంచి విద్యార్థులు వచ్చి తిలకించే విధంగా ఆయా పాఠశాలల అధ్యాపకులు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ ప్రదర్శన నిర్వాహకులు అందరూ సుమారు 50 నుండి 60 ఏళ్ల వయస్సు పైబడిన వారేనని అన్నారు. నేటి యువతరంతో పాటు భవిష్యతరాల ప్రజలకు కూడా పురాతన వస్తువులపై అవగాహన కల్పించాలనే సదుద్దేశంతో వేలాది రూపాయలు ఖర్చు చేసి వాటిని సేకరించి ఇలా ప్రదర్శనగా పెట్టడం అభినందనీయమన్నారు. పాలకొల్లుకు చెందిన కంచర్ల రాజేష్ ప్రపంచ దేశాలకు చెందిన బంగారం, వెండి, రజత నాణేలు, కారుమూరి సురేఖ ప్రత్యేకంగా ఏనుగులతో ఉన్న అనేక రకాల స్టాంపులు, అనకాపల్లికి చెందిన కొణతాల శ్రీనివాసరావు ఒకే నెంబర్‌తో ఉన్న నోట్లు, అమలాపురానికి చెందిన పుత్స కృష్ణ కామేశ్వరరావు 243 దేశాల కరెన్సీ నోట్లును ప్రదర్శనలో ఉంచారు.చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు కారుమూరి వెంకట నరసింహరావు, యూత్ హాస్టల్స్ సభ్యులు కారుమూరి సూర్యనారాయణ, కొట్టు భాస్కరరావు, నూలి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

వరద ముంపుతో అన్నదాత విలవిల


సిద్ధాపురంలో ముంపునీటితో హతమైన వరి పంట


కుళ్లిన వరి పొలాల్లో పేరుకుపోయిన అజొల్లా జాతి గడ్డి మొక్కలు

ముంపు నీటిలో కుళ్లిపోయిన వరి

ఆకివీడు: వరద ముంపుతో అన్నదాత విలవిలలాడుతున్నాడు. వరద ముంపు నీరు ఇంకా గ్రామాలను వదలలేదు. నీటి ముంపులోనే వరి పొలాలు చాలా గ్రామాల్లో ఉన్నాయి. ముంపునీరు నేడు కంపుకొడుతూ దుర్వాసన వెదజల్లుతోంది. వివిధ ప్రాంతాల నుంచి కొట్టుకొచ్చిన వ్యర్థాలు, ఒండ్రుతోపాటు వరి మొక్కలు, పిచ్చ మొక్కలు నీటిలో 15 రోజులకు పైగా మునిగిపోయి కుళ్లిపోయాయి. దీంతో వరద ముంపునీరు కూడా కుళ్లిపోయి నల్లగా మారింది. మురుగు నీరు పంట కాలువల్లోనూ, డ్రెయిన్లలో పొంగి ప్రవహిస్తున్నట్లున్నాయి. బోదెల్లో కూడా ఇదే నీరు నిలబడి ఉంది. ఉప్పుటేరులోకి ముంపు నీటి ప్రవాహ వేగం గ్రామాల నుంచి వేగంగా చొచ్చుకెళ్లడం లేదని రైతులు వాపోతున్నారు. దీంతో వరి చేలల్లో తూడు, గుర్రపుడెక్క, గడ్డిజాతి అజొల్లా విపరీతంగా పెరిగిపోతున్నాయి. దమ్ములో అజొల్లా కలిసిపోయే అవకాశం ఉన్నప్పటికీ ఇతర తూడు మొక్కలు తొలగించడానికి భారీ వ్యయమవుతోందని రైతులు ఆవేదన చెందుతున్నారు. మరి కొన్ని వరి చేలల్లో పంట చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతుంది. అయితే వ్యవసాయాధికారుల సూచనల మేరకు మందులు వాడితే గుప్పెడు గింజలు దక్కే అవకాశం మెరక పొలాలకు మాత్రమే ఉంది. పంట పొలాల్లోని ముంపు నీటిని బయటకు వేగంగా పోయే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. ముంపు, కంపు నీటితో గ్రామాల ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

పెనుమంట్రలో ఉచిత ధ్యాన శిక్షణ

పెనుమంట్ర: స్థానిక బ్రహ్మర్షి పత్రీజి పిరమిడ్ ధ్యాన మందిరం వద్ద ఆదివారం హైదరాబాద్‌కు చెందిన సీనియర్ పిరమిడ్ మాస్టర్ ఉమాచండ్ ధ్యాన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యం, ఆనందం రెండూ డబ్బుతో కొనలేనివని శాకాహారం ద్వారా ఆరోగ్యాన్ని ధ్యాన సాధన ద్వారా ఆనందాన్ని పొందవచ్చని అన్నారు. కార్యక్రమంలో భూపతిరాజు వెంకట శ్రీనివాసరావుజు, సాయిగీత, జిల్లా పీఎస్ఎస్ఎం అధ్యక్షులు రుద్రరాజు పెద్దివర్మ, జిల్లా కోఆర్డినేటర్ కేవీడీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పారిశుద్ధ్య సిబ్బందికి మెడికల్ క్యాంపు

నరసాపురం: నరసాపురం మున్సిపాలిటీ పారిశుద్ధ్య సిబ్బందికి వారి కుటుంబ సభ్యులకు ఈ నెల 23,24 తేదీల్లో స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ప్రత్యేక మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామని, పారిశుద్ధ్య కార్మికులకు అందుబాటులో ఉన్న అన్ని రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తారని స్పష్టం చేశారు.

నిలిచిన లైబ్రరీ నిర్మాణ పనులు


కాటన్‌పార్కు వద్ద నిలిచినపోయిన గ్రంథాలయ నిర్మాణం

నరసాపురం: పట్టణంలో కాటన్‌పార్కు వద్ద చేపట్టిన గ్రంథాలయ నూతన భవన నిర్మాణ పనులు నిలిచిపోయాయి. దీంతో శాఖా గ్రంథాలయానికి సొంత భవనం సమకూరాలన్న లక్ష్యం నెరవేరేలా కనిపించడంలేదు. 2023 జనవరిలో గ్రంథాలయ నిర్మాణానికి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం జిల్లా గ్రంథాలయ అభివృద్ధి సంస్థ ద్వారా 1.28 కోట్లు మంజూరు చేసింది. దీంతో అదే ఏడాది ఏప్రిల్ నెలలో పనులు ప్రారంభించారు. ప్రభుత్వ మాజీ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు సూచన మేరకు రైల్వేస్టేషన్‌రోడ్డులోని కాటన్‌పార్కు వద్ద 25 సెంట్లు మున్సిపల్ స్థలాన్ని గ్రంథాలయం కోసం కేటాయించారు. దీంతో ఎన్నో ఏళ్ల చరిత్ర ఉన్న నరసాపురం గ్రంథాలయానికి సొంత భవనం ఏర్పాటు కాబోతుందని అందరూ భావించారు. అయితే ప్రభుత్వం మారిన తరువాత పనులు అర్ధాంతంగా నిలపుదల చేశారు. 1954లో నరసాపురంలో గ్రంథాలయం స్థాపించారు. ప్రస్తుతం గ్రేడ్-1 గ్రంథాలయంగా కొనసాగుతోంది. ఇప్పటికీ ఈ గ్రంథాలయానికి ప్రతిరోజూ 200 మంది వరకూ రీడర్స్ వస్తారు. అయితే అద్దె భవనంలో అరకొర వసతుల మధ్య గ్రంథాలయంలో సేవలు కొనసాగుతున్నాయి.

సమస్య మళ్లీ మొదటికి..

సొంత భవనం సమకూరుతాదనుకుంటే సమస్య మళ్లీ మొదటికి వచ్చినట్లయ్యిందని రీడర్స్ ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కూడా టీడీపీ హయాంలో నిధులు అందుబాటులో ఉన్నా కూడా కనీసం స్థల సేకరణపై కూడా అప్పటి పాలకులు దృష్టి పెట్టలేదు. దాదాపు 70 ఏళ్ల సమస్యకు ముదునూరి ప్రసాదరాజు పరిష్కారం చూపించారు. ప్రభుత్వం మారడంతో పనులు నిలిచిపోయి సమస్య అలాగే ఉండిపోయింది.

లైబ్రరీ నిర్మాణ పనులు పూర్తి చేయాలి



నరసాపురం లైబ్రరీ పురాతనమైనది. మున్సిపాలిటీ ఏర్ప డక రెండేళ్లముందే ఇక్కడ లైబ్రరీ ఏర్పాటుచేశారు. ఇప్పటి వరకూ సొంత భవనం లేకపోవడం బాధాకరం. దీన్ని దృష్టిలో పెట్టుకుని లైబ్రరీ భవనానికి మున్సిపాలిటీకు చెందిన స్థలాన్ని కేటాయించాము. అప్పటి ఎమ్మెల్యే ముదునూరి నిధులు మంజూరు చేయించి పనులు మొదలు పెట్టించారు. అయితే కూటమి ప్రభుత్వంలో ఆగిపోయిన లైబ్ర రీ నిర్మాణ పనులు వెంటనే పూర్తి చేయించాలి.

– బర్రి శ్రీవెంకటరమణ, మున్సిపల్ చైర్‌పర్సన్

यूनियन बैंक Union Bank of India
వార్షికోత్సవ శుభాకాంక్షలు
ఇండస్ట్రియల్ ఎస్టేట్ శాఖ, భీమవరం



J.H.V.A. ప్రసాద్ - వాల్యూయర్
శ్రీసత్య సూర్య ఏజెన్సీస్ - కె.వి.ఎస్.ఆంజనేయరాజు
B.P.C.L. పెట్రోలు బంక్ - భీమవరం
చిన్ననారాయణరాజు - పెన్నాడ